# బాపూ బొమ్మ - 12

“ ఎందుకమ్మా నీకు అంత భయం...? మనం తప్పేమీ చెయ్యలేదుగా. నువ్వేమీ ఆవిడకు జవాబుదారీ కాదు ! అంతా నే చూసుకుంటాను. ఆ ఇంటినుండి బయటపడ్డాక నాలో భయం అనేది ఎగిరిపోయింది! నేను రెండు నిమిషాల్లో వచ్చి మాట్లాడతాగా...!” అంది బుల్లెమ్మాయి.

అలాగే అయిదు నిమిషాల తర్వాత అక్కడికి వచ్చిన బుల్లెమ్మాయి తల్లితో “ అమ్మా...నువ్వెళ్ళి వంటగదిలో పని చూసుకో..” అని చెప్పి “ నాన్నమ్మా...నువ్వు కూడా వెళ్ళు..అత్తయ్యతో నేను మాట్లాడతాగా...” అంటూ స్టూలు లాక్కుని ఆవిడకు ఎదురుగా కూర్చుంది.

ఆవిడ నవ్వు మొహంతో “ రెండురోజుల్లో తిరిగి వచ్చేస్తావనుకుంటే...ఇక్కడే స్థిరపడిపోయావేంటీ...?” అంది ముద్దుగా కసురుకుంటున్నట్లుగా.

వెనుదిరిగి వెళ్ళిపోతున్న అత్తాకోడళ్ళిద్దరూ ఆ మెత్తని మాటలకు ఆశ్చర్యంగా మొహమొహాలు చూసుకున్నారు.

“ నేను మా నాన్నతో బయలుదేరి వచ్చేస్తున్నపుడు...మీరో మంచి మాట చెప్పారు. ఆ మర్నాటికి తిరిగి రాకపోతే, ఇక రానవసరం లేదని! అది నాకు బాగా నచ్చింది. అందుకే ఇక ఇక్కడే ఉండిపోయాను...”

“ ఆడదానికి అత్తగారిల్లే శాశ్వతంగానీ అమ్మగారిల్లు కాదు తెలుసా...?” మృదుత్వం పాలు తగ్గి మామూలు కర్కశత్వం కొంచెం వచ్చేసింది..మాటల్లోకి.

“ అబ్బ..! మీరిలా మాట్లాడితేనే బావుంది ! అలవాటయిపోయింది ! కొత్తగా మృదువుగా మాట్లాడుతోంటే...ఏమిటోగా వుంది. మీకస్సలు నప్పలేదు...! “ చిన్న చిరునవ్వు వచ్చింది బుల్లెమ్మాయి పెదవులపైకి.

కోపంతో అరవాలనిపించినా ఆవిడ తమాయించుకుందని బుల్లెమ్మాయికి అర్థమైంది. ఒక క్షణం మౌనంగా ఉండి తరువాత సరదాగా నవ్వేసి “భలేదానివేలే...నీకన్నీ తమాషాలే..! సరేగానీ తొందరగా రెడీ అవు...వెళదాం..” అంది.

“ఎక్కడికీ..?” బుల్లెమ్మాయి ఆశ్చర్యంగా చూసింది.

“ అదేమిటే అలా అడుగుతున్నావూ..మనింటికే..!”

“ మన ఇల్లా...అదెక్కడుందీ..? మన ఇల్లంటే...మనల్ని కోరుకునే వాళ్ళుండాలి! ఇక్కడే నావాళ్ళు ఉన్నారు కాబట్టి ఇదే నా ఇల్లు అనుకుంటున్నాను...!”

బుల్లెమ్మాయి జవాబుకు ఆవిడ ఆవేశాన్ని అదుపు చేసుకుని “ భలే చమత్కారంగా మాట్లాడుతున్నావే.. హాస్యాలు చాలుగానీ బయలుదేరుదాం...వాడు మనకోసం ఎదురు చూస్తుంటాడు కూడానూ...!” అంటూ గలగలా నవ్వేసింది.

ఆవిడ అహంకారపు ఆకలికి బలి అయ్యేవాళ్ళు లేక, అధికారం కోల్పోయినట్లు విలవిలలాడిపోతున్నట్లుంది కాబోలు అనుకుంటూ బుల్లెమ్మాయ్ ఆవిడ వైపు విస్మయంగా చూసింది.

“మీ అబ్బాయి మీ కోసం ఎదురు చూస్తూ ఉంటాడేమో...ఏం...మీరు...ఎంతో కొంత డబ్బు విదిలించి రాకపోయారా...అపుడు మీకోసం కూడా ఎదురు చూస్తూ కూర్చోకుండా హాయిగా ఎక్కడికో ఎగిరిపోయేవాడుకదా..!”

కోపాన్ని అదుపులో పెట్టుకోవటం ఆవిడకు చాలా కష్టంగా ఉందని గ్రహించిన బుల్లెమ్మాయికి నవ్వొచ్చింది!

ఆవిడేమో కోపాన్నీ...తనేమో నవ్వునీ నిగ్రహించుకోవాల్సి వస్తోంది ! పరిస్థితి చాలా చిత్రంగా ఉందనుకుంటూ నిట్టూర్చింది బుల్లెమ్మాయి.

“ వాడు నాకోసం ఎదురు చూస్తూ కూర్చుంటాడా...!” అంటూ తెచ్చి పెట్టుకున్న నవ్వుతో మళ్ళీ అంది “ నాలుగురోజులనుండీ పోరుతున్నాడు ‘ నువ్వెళ్ళి తీసుకురామ్మా ‘ అని. అందుకే ఈ వేళ రాక తప్పలేదు! వాడికి డబ్బుకేం లోటు లేదు...ఇపుడు బుద్ధిగా పొలం వెళ్ళి పనులన్నీ దగ్గరుండి చూసుకుంటున్నాడు... వసూళ్ళు అవీ కూడానూ. డబ్బు పెత్తనమూ ఇపుడు వాడిదే. ఎన్ని వున్నా ఇల్లాలు లేని ఇల్లు ఇల్లులా ఉండదుకదే! అందుకే నన్ను తరిమితే, ఇలా పరిగెత్తుకొచ్చాను. సరేలే, కొన్నాళ్ళు సరదాగా పుట్టింట్లో గడుపుతావని నేనూ వూరుకున్నాను ఇన్నాళ్ళూ !” ‘ ఇక బయలుదేరదాం’ అన్నట్లు మాటల్లో కంగారు చూపించింది.

బుల్లెమ్మాయి ఆవిడ వైపు చురుగ్గా చూసింది.

“ అనవసరంగా మీరేం కంగారు పడకండి. మీ అబ్బాయికి చేతిలో డబ్బు ఉంటే, మీ కోసం అసలే ఎదురు చూడరని నాకూ తెలుసుగా. ఈ పాటికో లేక మరి కాస్సేపటికో పొలంలో ముక్కువగా కట్టించుకున్న చక్కని పొదరింటికి చేరి...మల్లెపందిరి వాసనలతో మత్తెక్కిపోతారు కూడానూ...!” వ్యంగ్యంగా మాటల్ని సాగదీసింది.

“ నీకు చమత్కారాలు ఎక్కువైపోయాయిలే ! పుట్టింట్లో అమ్మానాన్నల గారాబం బాగా ఎక్కువైనట్లుంది. పెళ్ళయిన పిల్ల పుట్టింటికి అపుడపుడూ వచ్చి నాలుగురోజులుంటేనే ముద్దూ ముచ్చటా జరుగుతుంది. ఇదే బావుందని కదలకుండా తిష్టవేసుక్కూర్చుంటే, ముద్దు చేసినవాళ్ళే వద్దు పొమ్మంటారు. అది తెలుసుకోవాలి. కష్టమైనా, నిష్టూరమైనా...అత్తగారిల్లే స్థిరం, సురక్షితం ! ఇవి నేను చెబుతున్న మాటలే కాదు, మన పెద్దలూ చెప్పినవే..!”

ఎంతో అనునయంగా, మృదువుగా మాట్లాడిన ఆవిడ చివరలో ఆడవాళ్ళ కష్టాలకు చలించిపోతున్నట్లుగా మొహం పెట్టి గట్టిగా నిట్టూర్చింది! మాటల్లో అధికారం చెలాయించినట్లే, అవసరం అనుకుంటే, అనునయాన్నీ కురిపించగల లౌక్యం బానే ఉందనుకుంటూ బుల్లెమ్మాయి మనసులోనే నిట్టూర్చింది. ఆవిడ వైపు కళ్ళు పెద్దవి చేసి మరీ ఆశ్చర్యంగా చూసింది. ఆవిడ మాటతీరు అచ్చంగా పెళ్ళిచూపులకి వచ్చినపుడులా ఉందనుకుంది.

పైకి అలా ఆదరంగా మాట్లాడినాగానీ, మనసులో మాత్రం...’ ఆ వూరుకి రా...నీ పని చెపుతానప్పుడు...’ అని రంకెలు వేస్తూ ఉండి ఉండొచ్చనుకుంది బుల్లెమ్మాయి.

ఒక క్షణం తను కూడా ఆవిడలాగే నటిస్తేసరి అనుకుంటూ బుల్లెమ్మాయి “ పెద్దవాళ్ళ సూక్తుల్ని ఎంత బాగా గుర్తుపెట్టుకున్నారూ...!” అంది. ఎంత బాగా చెప్పారోనన్న భావాన్ని చూపుల్లోనూ ఒలికించింది.

ఆవిడ పెదవులపైకి విజయగర్వంలాంటి చిరునవ్వు వచ్చింది. బుల్లెమ్మాయి వైపు తీవిగా చూసింది కూడా. కూర్చున్న తీరును మార్చుకుంటూ కాలు పైన కాలు వేసుకుని " అర్థమైందిగా, ఇక బయలుదేరుదామా..?" అనడగింది.

బుల్లెమ్మాయి అమాయకంగా చూస్తూ "ఎక్కడికీ " అని మళ్ళీ ఎదురు ప్రశ్న వేసింది.

" చెప్పిందంతా విన్నావుకదే, వాడు ఎదురు చూస్తూ ఉంటాడనీ, తొందరగా బయలుదేరుదామని చెప్పానుగా..!" అందావిడ. జారిపోతున్న ముసుగుని సవరించుకున్నట్లుగా మాటల్లోకి వచ్చేస్తున్న చిరాకుని వెనక్కి నెట్టేయగలిగింది.

బుల్లెమ్మాయి కూడా వీలైనంత సౌమ్యంగా జవాబు చెప్పింది " మీ అబ్బాయి నిజంగా నేను కావాలనుకుంటే తానే వచ్చేవాడు. ఆయన, చేతిలో ఉన్న మగ్గిన మామిడిపండును వదిలేసి, వగరు పిందె కోసం ఎదురుచూసే తెలివి తక్కువ రకం కాదులెండి. అయినా మీకు ఇ...న్ని...విషయాలు తెలుసుగదా..మీ కొడుకు ఈ మాట అన్నపుడు...పెద్దల సుద్దులు చెప్పి మందలించలేదెందుకనీ..?

పెళ్ళి ఒకరితో, కాపురం మరొకరితో సాగించవచ్చునని పెద్దలు చెప్పారేమో నాకు తెలియదులెండి. మీ కుటుంబ ఆనవాయితీ ఉల్లంఘించి బయటకు వచ్చేసిన నన్ను...మళ్ళీ రావచ్చని ఎలా పిలవగలుగుతున్నారూ...?"

బుల్లెమ్మాయి మాటలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు నిరసనగా అందావిడ " ఏదో పోనీలెమ్మని నాలుగు మెట్లు దిగివచ్చి పిలుస్తూంటే...బెట్టు చేస్తూ ఇన్ని మాటలా..?"

" ఇవి మాటలు కావు...అవమానాగ్ని రగులుతున్న మనసులోనుండి రాలుతున్న నిప్పురవ్వలు! మా పెద్దవాళ్ళు అక్కడికి వస్తున్నపుడు...అత్తగారికి, ఆయనగారికి ఎదురు చెప్పకూడదని నాకు నీతులు నూరిపోసారు ! కన్నవాళ్ళకి అప్రతిష్ట వస్తుందనే భావంతో ఎదురు తిరిగే మనసును అణిచిపెట్టాను ! మా బాబాయ్ ఇచ్చిన పుస్తకాలని చదివే అలవాటువలనో ఏమోగానీ మనసులో ఎపుడూ ఆలోచనల అలజడి రేగుతూండేది ! ఎన్నెన్నో ప్రశ్నలు మొలకెత్తేవి! చదువు కొనసాగించాలనే నా కోరికను కాదన్నా, పుట్టింటికి వెళ్ళి రావటానికీ వీలు లేదన్నా...ఎందుకు సహించాల్సి వచ్చింది...? ఇలా నాలో నేనే మధనపడుతూ మౌనంగా ఉండటం వలనే కదూ మూగమొద్దు అనే బిరుదును పొందానూ...? ఎలాగైతేనేం ...నాకు వరం ఇచ్చినట్లుగా కారాగారం నుండి విముక్తి ప్రసాదించేశారు...ఇపుడేమో తలుపులు తెరిచే వున్నాయంటూ పంజరంలోకి మళ్ళీ రమ్మంటున్నారు. ఏ చిలుకా రావటానికి సుముఖంగా లేదని నిర్ణయించుకున్నాకనే ఇటు వచ్చారని నాకు తెలుసు ! నేను ఒకసారి పెళ్ళి పేరుతో తెలియక ఆ పంజరంలో చిక్కుకున్నానుగానీ, ఇపుడు...అన్నీ తెలిసాక, మళ్ళీ రాగలనని ఎలా అనుకున్నారో నాకర్థం కావటం లేదు ! అణకువ అన్ని వేళలా పనికిరాదని తెలుసుకున్నాను ! అన్యాయానికి ఎదురు తిరిగి ప్రశ్నించాల్సిందే..! "

కళ్ళు పత్తికాయల్లా చేసి విస్తుపోతున్న ఆవిడను చూసి బుల్లెమ్మాయి చిరునవు చిందించింది ! మళ్ళీ మొదలుపెట్టింది..

" నోరూ వాయీ లేని మూగమొద్దు ఇంత వాగుడుకాయ అయిందేమిటా అని విస్తుపోతున్నట్లున్నారు..!

ఇంత ధైర్యం రావటానికి కారణం చెప్పమంటారా...? నాపై ఇపుడు ఎవరి అజమాయిషీ, అధికారం లేవు ! నా మాటలు, చర్యలకు నేనే భాద్యురాల్ని కూడా ! అయినవాళ్ళ అండదండలుంటే ఎవరికైనా ఆత్మవిశ్వాసం వస్తుందనుకుంటా ! అందుకే నాకు నచ్చినదారిలో సాగి చదువును కొనసాగించాలనుకుంటున్నా! నిరంకుశత్వానికి తలవొంచే అధ్యాయం నా జీవితంలో ముగిసిపోయింది ! విషయం మీకు అర్థమయ్యే ఉంటుంది. నాలుగురోజుల్లో మీ దగ్గరకు వచ్చే కాగితాలపై సంతకాలు చేయటమే మిగిలి ఉంది ! కోర్టుకి వెళ్ళే అనవసరమైన ఆలోచన చేయరనీ తెలుసు.

పెళ్ళయిన అమ్మాయికి పుట్టింట్లో ఆదరణ మూడునాళ్ళ ముచ్చటేనని అన్నారు. ఆడపిల్లలు మాత్రమే కాదు, మగవాళ్ళయినా సరే ఒక వయసు వచ్చాక ఆర్థికంగా ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడాల్సిందే ! నేనూ అంతే...ఆర్థికంగా ఎవరిమీదా ఆధారపడాల్సిన అవసరం లేకుండా నిలబడతాను...బలపడతాను !

ఆఖరుగా ఒక మాట ! ఈ సారయినా మీరు, మీ అబ్బాయి కలిసి పెళ్ళి విషయంలో ఏది ముఖ్యమో ఆలోచించుకుని ఒకే అభిప్రాయానికి రావటం మంచిది. ‘ కానీ కట్నం లేకుండా ‘ అనే మాటతో సూదులు గుచ్చే అవకాశం లేకుండా బోలెడన్ని కానుకలు...కాకపోతే కాసులు తెచ్చే అమ్మాయిని వెతుక్కోండి...! “ అంటూ మాటలు ముగించి ‘ ఇక వెళ్ళొచ్చు ‘ అన్నట్లుగా చేతులు జోడించి నిలబడింది.

ఆవిడ మొహం మాడ్చుకున్నట్లుగా విసురుగా లేచి నిలబడి రుసరుసలాడుతూ బయటకు వెళ్ళి బండెక్కి కూర్చుంది.

లోపలి గదిలో గుమ్మం దగ్గరే నిలబడి బుల్లెమ్మాయి సంభాషణ అంతా విన్న అత్తాకోడళ్ళు గానీ, లోపలే వున్న బుల్లెమ్మాయి తండ్రి గానీ ఎవరూ బయటకు రాలేదు !

బండి బయలు దేరి వెళ్ళిపోయింది.

★ ★ ★

పుట్టింటికి వచ్చిన రెండురోజులకే బుల్లెమ్మాయి శకుంతలకి ఉత్తరం రాసింది. ఎందుకు ఆమె ఉత్తరాలకి జవాబు రాయలేకపోయిందో వివరంగా తెలియజేసింది. వీలు చూసుకుని బయలుదేరి వస్తానని శకుంతల వెంటనే ఉత్తరం రాసేసింది. మళ్ళీ తర్వాత ఎపుడు వస్తున్నదీకూడా తెలియజేస్తూ ఇంకో ఉత్తరమూ వచ్చింది. దాన్నిబట్టి శకుంతల అక్క కూడా కాసేపటిలో వచ్చేస్తుందనుకుంది బుల్లెమ్మాయి.

అంతలోనే శకుంతల రివ్వున వచ్చేసి బుల్లెమ్మాయిని రెండు చేతులతో చుట్టేసింది.

“ నువ్వు ఇక్కడకు వచ్చావని తెలిసాక, నిన్ను చూడాలని మనసెంత కొట్టుకుపోయిందో ! నేనొచ్చి అయిదు నిమిషాలే అయినా అడుగు పెట్టగానే, అమ్మావాళ్ళంతా నీ సమాచారం చెవిన వేసేసారు ! మీ అత్తగారు ఇపుడే వచ్చి వెళ్ళిందటగా, నువ్వు బాగా దడదడలాడించేశావటా...!” అంటూ చిన్నగా నవ్వింది శకుంతల.

“ అయితే నేనేం చెప్పాల్సిన అవసరం లేదన్నమాటేగా...” అంది బుల్లెమ్మాయి నిట్టూరుస్తూ.

“ అదేంకాదు, మళ్ళీ అన్ని విశేషాలూ నీద్వారా వినాల్సిందే ! మీ అత్తగారికి ఏ మాత్రం బెదురు లేకుండా

ఎదురు ఎలా చెప్పగలిగావే...బంధం వదులుకున్నావు సరే, బాగా ఆలోచించావా...? "

" అనుబంధం ఏ మాత్రం లేని బంధం నుండి బయటపడటానికి ఆలోచన అవసరం లేనే లేదు ! నన్ను కట్టిపడేసేవి ఆర్థిక స్థితిగతులు మాత్రం కాదు, ఆప్యాయతా అభిమానాలు మాత్రమే ! ఈ విషయం అర్థమయ్యేట్లు వివరించే ప్రయత్నం చేశానంతే ! ఆ ఇంట్లో వాళ్ళతో కలిసి ఉన్నపుడు ఏవో రెండు మూడు సందర్భాలలో మాత్రమే నోరు విప్పి నా అభిప్రాయాలను బయటపెట్టానంతే ! ఇపుడు మా ఇంట్లో కదా... స్థానబలం అంటారు చూడూ...అందువలనేమో ఏ మాత్రం సంకోచం లేకుండా ...అప్పట్లో నేను మనసులో అనుకునేవన్నీ ఏకరువు పెట్టేశా ! అంతే...కొత్తగా ఏం లేవులే !

అన్నీ ఆవిడముందు బయటపెట్టేశాక, నా మనసు చాలా తేలికైంది ! కొండంత బరువేదో దిగిపోయినట్లుంది !

పరువు ప్రతిష్ఠ అనుకోకుండా నా కష్టసుఖాలకే ఎక్కువ విలువ ఇచ్చి, అక్కున చేర్చుకున్న తల్లిదండ్రులుండటం నా అదృష్టం ! " అంటూ చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంది బుల్లెమ్మాయి.

శకుంతల అనునయంగా చేయి పట్టుకుని " మరి ఇపుడు..." అంటూ ప్రశ్నార్థకంగా చూసింది.

" ఏముందీ..." అంటూ బుల్లెమ్మాయి చిన్నగా నవ్వింది. " ఇప్పుడు నేను మునుపటి అమ్మయినే.ఈ మధ్య జరిగిందంతా ఓ పీడకలలా మర్చిపోవాలనుకోవటంలేదు ! స్వతంత్రం విలువ, ఆత్మీయుల ఆసరా ఎంత అవసరమో గుర్తుంచుకుంటా. ఈ విషయం తెలియజేసే ట్రైనింగుకి వెళ్ళి వచ్చానని అనుకుంటానంతే. ఆ శిక్షణ ఇచ్చింది మా అత్తగారూ, ఆయనగారూ అన్నమాట...! "

" నీ దగ్గర్నుండి ఇలాంటి సమాధానం వస్తుందని మీ అత్తగారు అనుకుని వుండదు ! ఆశాభంగం కలిగి వుంటుందా?" అడిగింది శకుంతల.

" ఆశాభంగం, బాధా లాంటివి కలగవుగానీ, కోపం మాత్రం బాగా వచ్చివుంటుంది ! అయినా ఇలా జరగటం ఆవిడకూ మంచిదేలే ! ఈ సారి నాలాంటిదాన్ని కాకుండా, ఏటా పదిపుట్ల ధాన్యం, పది పన్నెండు పశువుల పాడీ విలువ తెలిసిన వివేకవంతురాల్ని కోడలిగా ఎన్నిక చేసుకునే అవకాశం దొరికిందిగా !

నేనుగానీ, ఇపుడు ఆవిడ మాటల్ని నమ్మి మళ్ళీ వెళ్ళి వుంటే, ఏం జరుగుతుందో ఊహించి చెప్పనా ? నాకోసం నాలుగు మెట్లు దిగివచ్చి మరీ నన్ను పిలిచిన తన ఔన్నత్యాన్ని గుర్తించలేని నా అమాయకత్వాన్ని నిత్యమూ వేధించే అవకాశం దొరికి ఉండేది ! ఇపుడది లేదు కాబట్టి నేనూ ఆ సాధింపులబారినుండి తప్పించుకోగలిగానన్నమాట ! ఇది నాకూ మంచిదేగా ! "

ఆ తర్వాత ఒక క్షణం మౌనంగా ఉండిపోయిన బుల్లెమ్మాయి మళ్ళీ చెప్పింది " బాబాయ్ నా చదువు కొనసాగించే ఏర్పాట్లు చేస్తున్నాడు. నా చదువుకి అమ్మానాన్నలు అంగీకారం తెలియజేయటమే కాదు, నాన్నమ్మ నాతో వచ్చి సాయంగా ఉంటానంది ! ఇంతకన్నా ఇంకేం కావాలీ...?

పిల్లలు తమ శక్తిసామర్థ్యాన్ని సరిగా అంచనా వేసుకుని నిర్ణయాలు తీసుకోవాలి ! తల్లిదండ్రులూ పిల్లల అభిరుచులూ, ఆకాంక్షలకు విలువ ఇచ్చి ఆదుకోగలగాలి ! అవును కదూ..? "

అవునన్నట్లుగా తలవూపుతూ " నువ్వు అదృష్టవంతురాలివే...! " అంది శకుంతల చిరునవ్వుతో.

★ ★ ★

చదవటం ముగించిన మానస ..''ఏమిటి బామ్మా... ఈ కథని ఇలా ముగించేశావ్...బుల్లెమ్మాయి తర్వాత ఏం చేసిందో కూడా చెప్పొచ్చుగా..?''అనడిగింది.

''ఆమాత్రం తెలుసుకోలేవా... అదీ వివరంగా చెప్పాలా...? నువ్వే ఊహించు...'' అంటూనే మళ్ళీ తనే చెప్పింది మహాలక్ష్మమ్మ. ''బుల్లెమ్మాయి తన ఇష్టప్రకారం కాలేజీ చదువు కొనసాగించింది.. పట్నంలో నాన్నమ్మతో కలిసి మకాం పెట్టి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తిచేసిందీ. తనకిష్టమైన పిల్లలకి చదువు చెప్పే ఉద్యోగాన్నీ సంపాదించింది. అదేలే... లెక్చరర్ జాబ్ అన్నమాట.

ఆ తర్వాత... తనని ఇష్టపడిన సహోద్యోగినే పెళ్ళి చేసుకుని స్థిరపడింది! తన అనుభవాలు ఆధారంగా చేసుకుని ఎన్నో వ్యాసాలూ, కథలు కూడా రాస్తూ... రచనా వ్యాసంగం ఒక వ్యాపకంగా మార్చుకుంది...! అంతే...!'' అంది చిరునవ్వుతో మహాలక్ష్మి.

''ఇది నీ కథేనని నాకు అర్థమైందిలే...'' అంటూ మానస నవ్వులు చిందించింది.

''నా చిన్నప్పుడు ఓసారి నేను నాన్నమ్మ అంటూ.. ఏదో నాన్నకి చెప్పబోతోంటే ఏమన్నారో తెలుసా...? 'మీ నాన్నమ్మని చిన్నప్పుడు అందరూ 'బాపూబొమ్మ' అని సరదాగా అనేవాళ్ళట. కొందరు బాపూబొమ్మలా ఉండేవాళ్ళని షార్ట్‌కట్‌గా బామ్మా అంటారు. అందుకే నువ్వు బామ్మా, అని పిలిస్తే ..రెండు విధాలుగానూ సరిపోతుంది' అని చెప్పారు. అందుకే ఈమాట నీతో చెప్పలేదు గానీ ..బామ్మా అని పిలవటం మొదలుపెట్టా... అది సరేగానీ, బామ్మా... బుల్లమ్మాయి అత్తగారు, ఆయనగారి సంగతంతా రాస్తే సరిపోయేదిగా! ఆయనగారు,తర్వాత ఆ మల్లెపందిరి, అదేలే... నాగసుందరిని పెళ్లి చేసుకున్నారా...?'' అల్లరిగా నవ్వుతూ అడిగింది.

"ఆ విషయాలన్నీ ఈ కథకి అనవసరం. ఇంతవరకూ చాలు..." అంటూ ఆవిడా సరదాగా నవ్వింది.

''నా చిన్నతనం రోజులకీ, ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చాయి. మా అమ్మా, నాన్నమ్మ పుస్తకాలు చదివేంత వరకూ చదువు నేర్చుకున్నారు. చాలామందికి ఆ శ్రద్ధా ఉండేది కాదు !నా తరంలో, ఊళ్లో ఉన్న చదువుకే 'పెళ్లయ్యేంత వరకు ఇంట్లో ఉండి, ఏం చేస్తుందిలే' అని పంపించేవారు. పొరుగూరికి వెళ్ళి కాలేజీలో చదువుకునే అవకాశం కష్టమే! పట్నాల్లో ఆడపిల్లలు మాత్రం కాలేజీకి వెళ్లగలిగేవారు.

నేను ఎలాగో నా కోరికను సాధించగలిగాను. నాన్న, నాన్నమ్మ తోడ్పాటు ఉండటం వల్ల. ఆ తర్వాత చదువుకుని ఉద్యోగాలు చేసే అమ్మాయిల సంఖ్య బాగానే పెరిగింది. నీ తరం వచ్చేసింది. పల్లెలు, పట్నాలు, అని లేదు... అమ్మాయిలూ పెద్ద పెద్ద చదువులు చదువుతున్నారు. అన్ని రంగాలలోకీ వెళ్తున్నారు! అంతేనా... చదువుల కోసం విదేశాలకీ ధైర్యంగా వెళ్లి వస్తున్నారు. ఈ మార్పుకి నాకు చాలా సంతోషంగా ఉంది మానసా ..!

కాలం, పరిస్థితుల్లో ఎంత మార్పు వచ్చినా, సమస్యల స్వరూపంలో మార్పు వస్తుందే తప్ప పూర్తిగా

మాసిపోవు! ఏదో సమస్యలు ఎవరికైనా తప్పనిసరి! ధైర్యంగా ఎదురు నిలబడి పరిష్కార మార్గాలు మనమే తెలుసుకోవాలి! సాధించాలి!

ఇప్పుడు ఇంట్లో నీ పెళ్ళి గురించీ ఆలోచిస్తున్నారు..! అందచందాల బట్టి మాత్రమే కాకుండా వ్యక్తిత్వం ఎలాంటిదో గమనించే ప్రయత్నమూ చేయాలనేదే నా సలహా! మన పెద్దలు ఓ సామెత చెబుతారు... 'అడుసు తొక్కనేలా, కాలు కడగనేల' అని. అంటే జాగ్రత్తగా ఆచితూచి అడుగేసినట్లుగా పనులు చక్కబెట్టుకోవాలని చెప్పటమే' ఒకోసారి మనం ఎంత నిదానంగా ఉన్నా అడుసులో అడుగు పడే ప్రమాదమూ ఉంటుంది! అలా తప్పించుకోలేని పరిస్థితుల్లో, విచారిస్తూ కూర్చోక కాళ్ళు కడుక్కునే ప్రయత్నమే చేయాలనుకో! మా నాన్నమ్మతో నాకేర్పడిన అనుబంధం లాంటిదే మనిద్దరి మధ్యా ఉంది! అందుకే ఆ రోజుల గురించి నీతో పంచుకోవాలనిపించింది! పెళ్ళి నిర్ణయం తీసుకునే ముందు, తొందరపడకుండా కొంచెం నిదానంగా అన్ని విషయాలనూ తెలుసుకునే ముందుకు వెళ్ళమని నా సలహాగా నీకు తెలియజేయటానికే...నా అనుభవాల్ని నీకు కథగా రాసి చూపిద్దామనే ప్రయత్నం చేశాను ! " అంది మహలక్ష్మి.

" నాకు మంచి బహుమతి ఇచ్చావు బామ్మా...." అంటూ మహాలక్ష్మి భుజం పై తలవాల్చింది మానస.

★★★★ సమాప్తం ★★★★